# కంచే చేనుమేస్తే...?

ఇంటరు పరీక్షలు సాగుతున్నాయి. ఇక్కడా అక్రమాలు జరక్కుండా తగు ఏర్పాట్లు చేశామని ప్రభుత్వం ప్రకటించింది.

ఆ రోజు లెక్కల పరీక్ష -

ప్రశ్నపత్రాలు లీకేజీ అవడం, మన రాష్ట్రంలో పరిపాటవడం వల్ల విద్యార్థుల్లో ఒక విధమైన ఉత్కంఠ ఉండనే ఉంది. ఎప్పుడు ఏ పరీక్ష కాన్సిలవుతుందోనన్న భయం వారిని నిశ్చింతంగా ఉండనివ్వడంలేదు. పరీక్ష జరుగుతున్న ఆ హాల్లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఇన్విజిలేటరుగా నగరంలోని ఓ కాలేజీ లెక్చరర్ రాఘవ వచ్చాడు. అతను పెద్ద వయసున్నవాడేం కాదు. యువకుడిగానే చెప్పొచ్చు. ముందుగానే తాను చాలా స్ట్రిక్టుగా ఉంటానని హెచ్చరించి విద్యార్థుల్లో సంచలనం సృష్టించాడు. ఫలితంగా కొందరు విద్యార్థులు తాము తెచ్చిన స్లిప్పులు తీయడానికి భయపడ్డారు. ఒకరిద్దరు అటువంటి ప్రయత్నం చేస్తే రాఘవ వారిని వారించి "ప్రథమ తప్పుగా మిమ్మల్ని క్షమిస్తున్నాను. మళ్ళీ అటువంటి తప్పు చేయకండి ! అనవసరంగా మీ భవిష్యత్తుని నాశనం చేసుకోకండి ! ఎవరు కాపీ చేసినా, స్లిప్పులు చూసి రాసినా, ఇంకే ఇతర అక్రమ చర్యలకు పాల్పడినా కఠిన చర్య తీసుకోమని పై నుంచి ఆదేశాలు వచ్చాయి. అంచేత మీరంతా ఎంతో జాగ్రత్తగా ఉండాలి !" అంటూ హెచ్చరించాడు రాఘవ.

అటువంటి ఆదేశాలు ఎప్పుడూ ఉన్నవేనని అందరికీ తెలుసు. అయితే ఆ రోజు ఆ లెక్చరర్ ప్రత్యేకంగా హెచ్చరించడంతో అతని ఆంతర్యం ఏమిటో వాళ్ళకి బోధపడలేదు. విద్యార్థుల మొహాల్లో నిరుత్సాహం పొడచూపింది. ఆ రోజు ప్రశ్నపత్రం కాస్త కఠినంగానే వున్నట్లు గమనించిన విద్యార్థులు, తెల్ల మొహాలు వేశారు. రాఘవలాంటి ఇన్విజిలేటరు ఆ రోజు రావడం, తమ దురదృష్టమనుకున్నారు. అందరూ ఆలోచనల్లో మునిగారు. కానీ, ఒక విద్యార్థి మాత్రం దించిన తల ఎత్తకుండా రాసుకుపోతున్నాడు. మిగిలిన విద్యార్థులందరికీ ఆశ్చర్యమేసింది. అతను ఆలోచించకుండా ఎలా పేపరు ఆన్సరు చేయగలుగుతున్నాడు. అదే అందరికీ కలిగిన సందేహం.

"ఒరేయ్, శ్రీనూ! కొద్దో గొప్పో తెలివైన వాళ్ళమనిపించుకున్న మనకే ఈ ప్రశ్నాపత్రంలో కొన్ని కొరుకుడు పడటంలేదు కదా ! మరి ఆ చివర్లో కూర్చున్న వాడు ఎట్లా ఆన్సరు చేయగలుగుతున్నాడ్రా?" అన్నాడు రాంబాబు.

శ్రీను, రాంబాబు పక్కపక్కనే కూర్చున్నారు. వాళ్ళిద్దరూ తెలివైన విద్యార్థులుగానే పరిగణింపబడు తున్నారు. వారికే ఆశ్చర్యం కలిగింది. "ఔన్రా, రాంబాబు ! నేనూ అదే ఆలోచిస్తున్నాను. మనందరికీ కాస్త కష్టతరమనిపించే ఈ ప్రశ్నపత్రాన్ని అతను అవలీలగా రాసిపారేస్తున్నాడేమిటి?" కళ్ళింతలు చేసుకుని అన్నాడు శ్రీను.

"అదే అర్థం కావడంలేదురా! ఒరేయ్, శ్రీనూ ! నాకో అనుమానం !"

" ఏమిటి?"

"అలా ఏమీ ఆలోచించకుండా రాసుకుపోతున్నాడంటే, అతను నిజంగా స్టూడెంటేనా? లేక స్టూడెంటు స్థానంలో వచ్చి రాస్తున్న ఇంకెవరైనా?" సందేహాన్ని వ్యక్తం చేశాడు రాంబాబు.

అప్పుడు శ్రీనుకి అనిపించింది అతను విద్యార్థి కాడేమోనని, వడ్డించేవాడు మనవాడైతే.. అన్న సామెత జ్ఞప్తికొచ్చింది. అతనూ ఏదో అనబోతున్నంతలో ఇన్విజిలేటరు రాఘవ అక్కడికి వచ్చాడు.

"ఏమిటి, అలా దిక్కులు చూస్తున్నావు?"

రాంబాబుని ప్రశ్నించాడు రాఘవ.

"దిక్కులు చూడక ఏం చేయమంటారు, సార్? ప్రశ్నాపత్రాన్ని మీరు చూసే ఉంటారు కదా! చాలా కఠినంగా ఉంది.".

"అలాగా! దానికి ఎవరేం చేస్తారు లేవోయ్! రాసిన వాళ్ళు రాస్తూనే ఉన్నారు కదా!" తేలిగ్గా అనేసి ముందుకు సాగాడు రాఘవ.

"సార్ !" శ్రీనివాస్ పిలిచాడు.

"నన్ను చెప్పమంటే అది వీలుపడదు. నేను చాలా స్ట్రిక్టుగా ఉండేవాణ్ణి !" అన్నాడు దగ్గరికొస్తూ.

" అబ్బే, అదేం కాదండీ !"

"మరేమిటి?"

"ఈ హాల్లో చాలా మంది విద్యార్థులు కఠినంగా ఉన్న పేపరు చూసి ఆలోచనలోపడి, దిక్కులు చూస్తుంటే, అదిగోండి... ఆ చివర కూర్చున్న స్టూడెంటు మాత్రం తలెత్తకుండా లెక్కలు చేసుకు పోతున్నాడు. పేపరు లీకయిందంటారా?" అన్నాడు శ్రీనివాస్.

శ్రీనివాస్ ప్రశ్న తన పక్కనే బాంబుపడినట్టుగా కలవరపాటు కలిగించింది ఇన్విజిలేటర్ రాఘవకి.

అతని మొహం కోపంతో ఎర్రబారింది.

"వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకింగ్ ? ఇదో పాషనయిందీ రోజుల్లో ! మైండ్ యువర్ వోన్ వర్క్!" చిర్రుబుర్రులాడుతూ అనేసి, అక్కణ్ణించి వెళ్ళిపోయాడు రాఘవ - ఫాంటు జేబులోంచి రుమాలు తీసి మొహం ఒత్తుకుంటూ,

రాంబాబు వెంటనే అందుకున్నాడు. "సార్ ! వాడి అభిప్రాయం నిజానికి అది కాదు, సార్ !" అన్నాడు రాంబాబు.

"మరేమిటయితే?" రాఘవ అసహనంగా అడిగాడు.

రాంబాబు శ్రీనివాస్ కేసి పరికించాడు. అడిగేయమన్నట్టు కళ్లతో సైగ చేశాడు శ్రీనివాస్.

"నిజంగా అతను స్టూడెంటేనా అన్న సందేహం మాకు కలుగుతోంది, సార్!" సందేహాస్పదంగా అన్నాడు రాంబాబు.

రాఘవ మొహంలో ఒక విధమైన కంగారు ద్యోతకమవుతోంది.

"నీ పేపరు నువ్వు రాసుకోవయ్యా, బాబూ! ఎందుకీ ప్రయోజనంలేని సందేహాలు? నీ సమయాన్ని అనవసరంగా వృధా చేసుకోకు!" సహనాన్ని కోల్పోతూ కాస్త దురుసుగానే అన్నాడు రాఘవ.

"కళ్ళముందే అక్రమం జరుగుతుంటే ఎలా సహించి ఊరుకోవడం, సార్ ? మీరే కదా - మొదట్లో చెప్పారు. ఎటువంటి అక్రమాన్నయినా సహించమని !" నిల్చుంటూ అన్నాడు శ్రీనివాస్.

శ్రీనివాస్ మాటలు హాల్లో ఉన్నవాళ్ళంతా విన్నారు. అందరి దృష్టి శ్రీనివాస్‌మీద పడింది.

"వాట్? అక్రమమా? ఏం జరిగిందని?"

"ఆ చివర కూర్చుని తలెత్తకుండా రాసుకుపోతున్న వ్యక్తి స్టూడెంటు కాడని మా అనుమానం సార్! అతను స్థానికంగా ఉన్న ట్యూటోరియల్ కాలేజికి చెందిన వ్యక్తిలా తోస్తోంది. అతణ్ణి మేం చూసినట్టే అనిపిస్తోంది. ఇది అక్రమం కాదంటారా సార్? మీలాంటివాళ్ళు ఎట్లా దీన్ని సమర్థిస్తున్నారు?" అన్నాడు రాంబాబు చిరు కోపంతో.

రాంబాబు, శ్రీనివాస్‌లు ఈ సందేహాన్ని వ్యక్తం చేయడం పట్ల అంతవరకూ తలెత్తకుండా రాసుకుపోతున్న ఆ వ్యక్తి ఇప్పుడు తలెత్తాడు. అతని మొహంలో ఆరాటం తారాడుతోంది. అతనితో పాటు రాఘవ మొహంలోనూ కంగారు కనిపిస్తోంది.

హాల్లో ఉన్న ఇతర విద్యార్థులు ఈ విషయాన్ని ముక్తకంఠంతో బలపరిచే ముందే ఈ సమస్యని తుంచిపారేయాలనుకున్నాడు ఇన్విజిలేటర్ రాఘవ. వాళ్ళిద్దరి వైపు తీక్షణంగా చూశాడు.

" చూడండి మిస్టర్ ! మీ రిద్దరూ లేనిపోనివన్నీ ఊహించుకుని అతిగా మాట్లాడుతున్నారు.

నాకున్న పవర్స్ ఏమిటో మీకు తెలీయనట్టుంది. మీరిద్దరూ కాపీ కొడుతున్నట్టు మీ మీద అభియోగాన్ని మోపి, బయటకు పంపించేస్తాను. అప్పుడు మీ భవిష్యత్తు ఏమవుతుందో ఒక్కసారి ఆలోచించుకోండి. మీ పేపరేదో మీరు రాసుకుని నోరు మూసుక్కూచుంటారా, లేక బహిష్కరణకి గురవుతారా ? ఏదో తేల్చుకోండి !'' కోపంగా అన్నాడు రాఘవ.

నిర్ఘాంతపోయారు శ్రీనివాస్, రాంబాబు. పరస్పరం మొహాలు చూసుకున్నారు. మిగతా విద్యార్థులంతా తమకెందుకీ గొడవనుకుని పరీక్ష రాయడంలో నిమగ్నులయ్యారు.

శ్రీనివాస్, రాంబాబు ఆవేశాన్ని పెంచుకోకుండా సమన్వయ ధోరనిలో ప్రవర్తించారు. బహుశా ఇన్విజిలేటరు రాఘవకి, ట్యూటోరియల్ సంస్థ వారికి ఏదో ఒప్పందం ఉండి ఉంటుందని వాళ్ళిద్దరూ మనసులో అనుకున్నారు. తమ భవిష్యత్తు తాము చేతులారా పాడుజేసుకోవడం ఎందుకనుకున్నారు.

"ధన్యవాదాలు, మాస్టారూ ! అక్రమం బాహాటంగా జరుగుతుంటే దాన్ని ఎత్తి చూపించడం కూడా అక్రమమే అయితే, న్యాయానికీ, ధర్మానికీ విలువే ముంది మాస్టారూ ! మే మిద్దరం ఎందుకు అకారణంగా బలిపశువులమవ్వాలి, వద్దులెండి, గెలుపు మీదే మాస్టారూ !'' అంటూ వాళ్ళిద్దరూ కూర్చుండిపోయి, పేపరు రాసుకోవడంలో నిమగ్నమయ్యారు. వారి పెదాలపై సన్నని దరహాసం చిందులాడుతోంది.

ఇన్విజిలేటరు రాఘవ మరోసారి రుమాలుతో మొహం తుడుచుకుని, చివర కూర్చున్న ట్యూటోరియల్ వ్యక్తిగా అభియోగింపబడిన వ్యక్తి దగ్గరికి వెళ్లి ఏం మాట్లాడాలో ఏమో గాని, ఆ వ్యక్తి వెంటనే ఆన్సరు పేపర్ని రాఘవకి అందించేసి బయటకి నిష్క్రమించాడు.

రాంబాబు, శ్రీనివాస్ నవ్వుకున్నారు. హాల్లోని మిగతా విద్యార్థులంతా విస్తుపోయారు. అంత కఠినమైన పేపర్ని, అంత త్వరగా అతను ఎలా పూర్తి చేయగలిగాడా అని, ప్రశ్నలన్నీ ముందుగానే తెలిస్తే ఆన్సరు రాయడం ఎంతసేపు ? ఆ పనే అతడు చేసినట్టున్నాడు అనుకున్నారు. ఆ హాల్లో ఆ రోజు ఆ విషయమే చర్చగా మారింది. విద్యార్థుల్లో, ఇన్విజిలేటరు రాఘవ తప్పు చేసిన వాడిలా మొహం దించుకుని ఆన్సరు పేపర్లని ఆఖర్న తీసుకుని వడివడిగా వెళ్ళిపోయాడు. అతని నడకలో తత్తరపాటు కనిపిస్తోంది.

ఆ రోజు సాయంత్రం రేడియోలో ఫ్లాష్ న్యూస్ - ఆ రోజు ఇంటరు లెక్కల పేపరు లీకైనందుకు ఆ పేపర్ని మాత్రమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

రాఘవ మొహం వాడిపోయింది.

రాంబాబు, శ్రీనివాస్ మాత్రం తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

(ఎవరినీ ఉద్దేశించింది కాదు, భుజాలు తడుముకోవద్దు)

□□□ (ఆంధ్రప్రభ వారపత్రిక 1-12-97)